MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption


## తెలంగాణ జిల్లాలు

శనివారం 12-09-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# ఖాజాగూడ 27/1 ప్రభుత్వ భూమిలో భారీ నిర్మాణం పై అధికారుల మౌనం వెనుక అసలు కారణం ఏమిటి...?

సాక్ష్యాధారాలతో వరుస కథనాలు వస్తున్నా కన్నెత్తి చూడని అధికారులు..!

కలెక్టర్ ప్రజాపాలనలో ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రజలు



RTI సాక్ష్యం



రెవెన్యూ రికార్డు సాక్ష్యం





## ఆ బిల్డర్ ముందు CMC, రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనం..?

## ఆ బిల్డర్ సర్వే నెంబర్ 27/1లో ఎవరి అండ...?

2లో

## ప్రభుత్వ భూమి అంటున్నారు.. భారీ భవనం వెలుస్తోంది..! అధికారులు ఎక్కడ..?

# రోడ్డుపై రోడ్డు.. ఇదేం నిర్మాణం?



3లో

# అక్రమమే అయితే సక్రమం ఎలా అయ్యింది?

చర్యలు తీసుకున్న అధికారులే తెలిపాలి...

- ఆగస్టు 28న కూల్చిన షెడ్.. సెప్టెంబర్ 9న సక్రమమైందా?..
- కూల్చివేత నుంచి తిరిగి కొనసాగింపు వరకు ఏం జరిగింది?
- ఇది ఒకటేనా ఇంకా ఇలాగే ఏమైనా ఉన్నాయా దానిపై ఏసీబీ విచారణకు డిమాండ్.....



8లో

# ఖాజాగూడ 27/1 ప్రభుత్వ భూమిలో భారీ నిర్మాణం పై అధికారుల మౌనం వెనుక అసలు కారణం ఏమిటి...?

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ స్టేట్ బ్యూరో:** రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలము, ఖాజాగూడలోని సర్వే నెంబర్ 27/1కు సంబంధించిన భూ వ్యవహారం రోజురోజుకూ అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో పేర్కొంటున్న భూమిలో భారీ వాణిజ్య నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలు రికార్డులు, అధికారిక సమాచారాన్ని ఆధారంగా చేసుకుని వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి స్పష్టమైన వివరణ లేదా చర్యలు కనిపించకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది.

**అది ప్రభుత్వ భూమినే... అయినా భారీ నిర్మాణం జరుగుతుంది..!**

సర్వే నెంబర్ 27/1 భూమి స్వభావం, హక్కులు, నిర్మాణానికి సంబంధించిన అనుమతులపై ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయి. రెవెన్యూ శాఖ రికార్డుల ప్రకారం భూమి ప్రభుత్వ భూమి అని నిర్ధారించిన అధికారులు, మరి అక్కడ భారీ నిర్మాణానికి సంబంధించి భూ హక్కు ఏ ప్రాతిపదికన చూపించారు? నిర్మాణ అనుమతుల కోసం ఏ పత్రాలు సమర్పించారు? అధికారులు చెర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాయా? జారీ అయితే ఏ సంస్థ ద్వారా, ఏ పత్రాల ఆధారంగా, ఏ నిబంధనల ప్రకారం అనుమతి ఇచ్చారు? అన్నది సంబంధిత అధికారులు ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

**భూమి ప్రభుత్వానిదైతే.. నిర్మాణదారుడికి హక్కు ఎలా వచ్చింది?**

నిర్మాణానికి సంబంధించిన పత్రాలు ఉన్నట్లయితే వాటి చట్టబద్ధత ఏమిటి? భూమిపై హక్కు చూపిస్తున్న పత్రాలు ఏవి? వాటిని ఏ శాఖ పరిశీలించింది? రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటే వాటి ఆధారం ఏమిటి? అనే అంశాలపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్ అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**బిల్డర్ ముందు జవీజ, రెవెన్యూ అధికారులు ఎందుకు మౌనం..?**

ఒకవైపు నిర్మాణం జరుగుతుందనే ఆరోపణలు, మరోవైపు భూమి ప్రభుత్వ భూమి అనే వాదనలు వినిపిస్తున్న నేపథ్యంలో సంబంధిత మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఎందుకు స్పష్టమైన తనిఖీ చేయడం లేదనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నిర్మాణానికి అనుమతులు ఉంటే వాటిని ప్రజల ముందు ఉంచాలి. అనుమతులు లేకుంటే చర్యలు తీసుకోవాలి. భూమి ప్రభుత్వ భూమి అయితే ప్రభుత్వ ఆస్తిని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఈ మూడు అంశాల్లో ఏది నిజమో అధికారులు ఇప్పటివరకు స్పష్టంగా చెప్పకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**ఆ బిల్డర్ కి సర్వే నెంబర్ 27/1లో ఎవరి అండ..?**

స్థానికుల్లో ఇప్పుడు మరో ప్రశ్న వినిపిస్తోంది."ప్రభుత్వ భూమి అని రికార్డులు చెబుతున్నా.. భారీ నిర్మాణం ఎలా కొనసాగుతోంది?" అధికారుల తనిఖీలు జరిగాయా? జరిగితే ఏమి తేలింది? నిర్మాణానికి సంబంధించిన అనుమతులు పరిశీలించారా? రెవెన్యూ రికార్డులను మున్సిపల్ అధికారులు పరిశీలించారా? నిర్మాణదారుడు సమర్పించిన పత్రాలను ఎవరు ధృవీకరించారు? ఏదైనా నోటీసు ఇచ్చారా? ఇచ్చి ఉంటే తదుపరి చర్య ఏమైంది? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం.

**వరుస కథనాల తర్వాత కూడా చర్యలు ఎక్కడ?**

సర్వే నెంబర్ 27/1 వ్యవహారంపై సాక్ష్యాధారాలతో వరుస కథనాలు వెలువడుతున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన చర్య కనిపించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ భూమి అయితే దాన్ని రక్షించాల్సిన బాధ్యత ఎవరిది? నిర్మాణానికి అనుమతులు లేకుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత ఎవరిది? అనుమతులు ఉంటే అవి ఏ పత్రాల ఆధారంగా మంజూరయ్యాయి? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా ఉందా? రెవెన్యూ, మున్సిపల్ శాఖలు పరస్పరం రికార్డులు పరిశీలించాయా? ఈ ప్రశ్నలకు అధికారిక సమాధానాలు రావాల్సి ఉంది.

**కలెక్టర్ ప్రజాపాలనలో ఫిర్యాదు చేసేందుకు ప్రజలు సిద్ధం**

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు స్పందించకపోతే ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని స్థానికులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ భూమి పరిరక్షణ, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూమి హక్కులు, పత్రాల చట్టబద్ధత తదితర అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరుతున్నారు. అవసరమైతే రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్ తదితర శాఖల రికార్డులను సమన్వయం చేసి సర్వే నెంబర్ 27/1పై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం పై అధికారులు ఎందుకు స్పందించడం లేదో...? అటు వైపు ఎందుకు చూడడం లేదో..? పూర్తి సమాచారం తో అధికారులు తమ నిజాయితీని కాపాడుకుంటారో లేదో రేపటి కథనం తో మీ ముందుకు... నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపుకాస్తుంది... అధికారులు బయటకు వచ్చి స్పందించే వరకు ఆగాదు ఈ పోరాటం..!

**నకిలీ**
**కోర్టు ఆర్డర్లు.. సేల్ డీడ్లు..నానా..**
**అసలు కథ ఏమిటి?**

సర్వే నెంబర్ 27/1కు సంబంధించి కోర్టు వ్యవహారాలు, సేల్ డీడ్లు, ఒప్పందాలు, నానా వంటి పత్రాల ప్రస్తావన కూడా తెరపైకి వస్తోంది. అయితే ఏ పత్రం నిజమైనది? ఏది చట్టబద్ధమైనది? భూమిపై హక్కును నిర్ధారించే పత్రం ఏది? అన్నది సంబంధిత అధికారిక రికార్డుల ద్వారానే తేలాల్సి ఉంది. కేవలం పత్రం ఉండటం వల్లే ప్రభుత్వ భూమిపై వ్యక్తిగత హక్కు ఏర్పడుతుందా? ప్రభుత్వ భూమికి సంబంధించిన హక్కులపై రెవెన్యూ శాఖ స్పష్టమైన నిర్ణయం తీసుకుందా? నానా దరఖాస్తు లేదా ఇతర ప్రక్రియ ఏదైనా ఉంటే దాని స్థితి ఏమిటి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంది.



# ఖైరతాబాద్ బడా గణేశ్.. నేటి నుంచి ట్రాఫిక్ ఆంక్షలు



ఖైరతాబాద్ బడా గణేశ్ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా 12 నుంచి 24వతేదీ వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. పీవీ విగ్రహం వైపు రాజీవ్‌గాంధీ విగ్రహం మీదుగా మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్ ను రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నిరంకారి జంక్షన్‌వైపు, రాజ్‌దూత్‌లేన్ మీదుగా బడా గణేశ్‌వైపు వెళ్లే వాహనాలను ఇక్బాల్‌మినార్‌వైపు, మింట్ కాంపౌండ్ మీదుగా ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలను మింట్ కాంపౌండ్ లైన్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డువైపు, మింట్‌కాంపౌండ్ వైపు వెళ్లే వాహనాలను నెక్లెస్‌రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు, ఖైరతాబాద్ పోస్ట్‌ఆఫీస్ లేన్ మీదుగా ఖైరతాబాద్ రైల్వేగేటు వైపు వెళ్లే వాహనాలను పోస్ట్‌ఆఫీసు వద్ద పాత పీఎస్ సైఫాబాద్ జంక్షన్‌వైపు మళ్లిస్తామని తెలిపారు. నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తులు రేస్ కోర్సు రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్‌ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీజాగలో నెక్లెస్‌రోటరీ , ఎన్టీఆర్ గార్డెన్ నుంచి వచ్చే వాహనాలను, ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్ వద్ద పార్కింగ్ చేయాలని ఆయన కోరారు.



## కర్కల్‌పహాడ్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కడ్తాల్ మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాణవత్ తేజీరామ్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ బత్తోజు విష్ణువర్ధన్, గ్రామ అధ్యక్షులు పట్నం కృష్ణయ్య, కంబాలపల్లి వీరయ్య, సయ్యద్ జాలాలుద్దీన్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పురుషోత్తం, రాజేందర్ రెడ్డి, పట్నం నర్సింహ, కానుగుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ నిత్యావసర సామగ్రి పంపిణీ

**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** చేవెళ్ల మున్సిపాలిటీ 14వ వార్డులోని ఆదర్శ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ సహకారంతో విద్యార్థులకు అవసరమైన ప్లేట్లు, స్పూన్లు, గ్లాసులు, జగ్గులు, బెడ్‌షీట్లు, ట్రంక్ పెట్టెలను మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, 14వ వార్డు కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించడం ద్వారా విద్యాభ్యాసానికి అనుకూలమైన వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి నడవడిక, సామాజిక బాధ్యతలను అలవరచుకోవాలని ఆకాంక్షించారు. కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్, కౌన్సిలర్స్ మరియు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డుపై రోడ్డు.. ఇదేం నిర్మాణం?

**పాత రోడ్డుపైనే కొత్త రోడ్డు..**

**అర్ధరాత్రి పనులు**

**నాణ్యతపై స్థానికుల తీవ్ర అనుమానాలు**

**అధికారుల పర్యవేక్షణ ఎక్కడంటూ ప్రశ్నలు**

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్‌లో రోడ్డు నిర్మాణ పనులపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఉన్న పాత రోడ్డును తొలగించకుండా,అదే రోడ్డుపైనే మరోసారి కొత్త రోడ్డు వేయడం ఏమిటంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో హడావుడిగా పనులు చేపట్టి కాంట్రాక్టర్ వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### అర్ధరాత్రి హడావుడి.. అసలు కారణమేంటి?

బాబుల్ రెడ్డి నగర్‌లో రోడ్డు పనులు అర్ధరాత్రి సమయంలో చేపట్టడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ పనుల నాణ్యతను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే పనులు జరుగుతున్న సమయంలో అధికారులు ఎంతమేరకు పర్యవేక్షించారు? కాంట్రాక్టర్‌కు నాణ్యతా ప్రమాణాలపై ఏమైనా సూచనలు ఇచ్చారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### పాత రోడ్డుపైనే కొత్త రోడ్డు!

పాత రోడ్డు ఉన్నప్పటికీ దానిని తొలగించకుండా లేదా అవసరమైన విధంగా ఉపరితలాన్ని సిద్ధం చేయకుండా దానిపైనే కొత్త రోడ్డు వేయడం సరైన నిర్మాణ పద్ధతేనా అంటూ స్థానికులు నిలదీస్తున్నారు. పాత రోడ్డుపై కొత్త పొర వేయడం వల్ల రోడ్డు ఎత్తు పెరగడంతో పాటు,కొద్దికాలానికే రోడ్డు దెబ్బతినే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి ముందు ఎలాంటి సాంకేతిక పరిశీలన నిర్వహించారో అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

### నాణ్యత గాలికొదిలేశారా?

రోడ్డు నిర్మాణంలో ఉపయోగించిన మెటీరియల్ నాణ్యతపైనా స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఎంత మందంతో వేశారు? ఏ నాణ్యత కలిగిన మెటీరియల్ ఉపయోగించారు? నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? అనే విషయాలపై స్పష్టత లేదని చెబుతున్నారు. కేవలం పైపైన రోడ్డు వేసి బిల్లులు చెల్లించే పరిస్థితి ఏర్పడితే చివరకు నష్టపోయేది ప్రజలేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రోడ్డు పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ,బాబుల్ రెడ్డి నగర్‌లో పనులు జరుగుతున్న సమయంలో అధికారుల పర్యవేక్షణ కనిపించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ పనులు





పూర్తి చేసి వెళ్లిపోయిన తర్వాత నాణ్యతను పరిశీలించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పనులు జరుగుతున్న సమయంలోనే అధికారులు తనిఖీ చేసి ఉంటే లోపాలను గుర్తించి సరిచేసే అవకాశం ఉండేదని పేర్కొంటున్నారు.

### ప్రజాధనానికి విలువ లేదా?

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నప్పుడు ప్రతి రూపాయికి లెక్క ఉండాలని స్థానికులు అంటున్నారు. నాణ్యత లేని రోడ్డు కొద్దికాలానికే దెబ్బతింటే మళ్లీ మరమ్మతుల పేరుతో ప్రభుత్వ నిధులు ఖర్చు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే ప్రాంతంలో పదేపదే రోడ్డు పనులు చేపట్టడం వల్ల ప్రజాధనం వృథా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### నాణ్యత పరీక్షకు సిద్ధమా?

బాబుల్ రెడ్డి నగర్‌లో వేసిన కొత్త రోడ్డుకు సంబంధించి సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు మందం,ఉపయోగించిన మెటీరియల్,నిర్మాణ ప్రమాణాలు,పనుల అంచనా వ్యయం తదితర అంశాలను సాంకేతికంగా పరిశీలించాలని కోరుతున్నారు. అవసరమైతే రోడ్డు నాణ్యతపై ల్యాబ్ పరీక్షలు నిర్వహించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేస్తున్నారు.

### సమాధానం చెప్పాల్సింది ఎవరు?

బాబుల్ రెడ్డి నగర్‌లో పాత రోడ్డుపైనే కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు వస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది. పాత రోడ్డును ఎందుకు తొలగించలేదు? పనులకు సంబంధించిన నిబంధనలు ఏమిటి? కాంట్రాక్టర్‌కు ఏ మేరకు పనులు అప్పగించారు? పనులను ఎవరు పర్యవేక్షించారు? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు కోరుతున్నారు.రోడ్డు పనుల్లో అవకతవకలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు,నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం వృథా కాకుండా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

## జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియామకం

**ఉత్తర్వులు జారీ చేసిన జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్**

**రామన్నపేట క్రైమ్ మిర్రర్:** తెలంగాణ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ముత్యాల రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జర్నలిస్టుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ తోగరి కరుణాకర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం ముత్యాల రమేష్ చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు



తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జేఏసీ చైర్మన్ తోగరి కరుణాకర్‌కు ముత్యాల రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యలను జేఏసీ దృష్టికి తీసుకెళ్లి, వారి సంక్షేమం కోసం తనవంతు కృషి చేస్తానని ముత్యాల రమేష్ పేర్కొన్నారు. ఆయన నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# పెబ్బేరులో మట్టి గణపతి విగ్రహాలు ఉచిత పంపిణీ

**మట్టి గణపతులనే పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం**

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



**వనపర్తి సెప్టెంబర్ 11 క్రైమ్ మిర్రర్‌ద:** రసాయనాలు, కృత్రిమ రంగులతో తయారుచేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి తీవ్ర హాని జరుగుతోందని, ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెబ్బేరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చౌరస్తా వద్ద ఏకో ఫ్రెండ్లీ మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... చెరువులు, జలాశయాలు కలుషితం కాకుండా కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే మున్సిపాలిటీ తరఫున ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం 'మట్టి గణపతిని వాడుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే ప్రచార పోస్టర్‌ను లాంచ్ చేశారు. ప్రజల సౌకర్యార్థం మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశామని, కావాల్సిన వారు అక్కడకి వచ్చి విగ్రహాలను ఉచితంగా తీసుకోవచ్చని వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సుమిత్ర ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఆడంబరాల కంటే భక్తితో పూజించడమే ముఖ్యమని, పర్యావరణానికి మేలు చేసే మట్టి విగ్రహాలనే వాడాలని సూచించారు. 7వ వార్డు కౌన్సిలర్ శివసాయి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాల వల్ల నదులు, చెరువుల్లోని చేపలు, ఇతర జలచరాలు చనిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 12వ వార్డు కౌన్సిలర్ సౌజన్య దిలీప్ మాట్లాడుతూ వినాయక చవితిని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, గణేష్ మండపాల వద్ద అలాగే నిమజ్జనం సమయంలో భక్తులందరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్, వార్డు అధికారులు మిథున్, ప్రశాంత్, మున్సిపల్ మరియు మెప్మా సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి మార్కెట్ డైరెక్టర్ మోతే రాములు, వెంకటేశ్ సాగర్. ముఖ్య నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంటి వెలుగుతో పేదల జీవితాల్లో కొత్త ఆశలు



**ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆరో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం**

**ఐదు మండలాల్లో 19,200 మందికి కంటి పరీక్షలు..**

**722 మందికి ఉచిత శస్త్రచికిత్సలు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఆర్థిక ఇబ్బందులతో కంటి సమస్యలకు వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా ఐక్యత ఫౌండేషన్ అందిస్తున్న ఉచిత కంటి వైద్య సేవలకు విశేష స్పందన లభిస్తోంది. ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలో ఆరో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభమైంది. కడ్తాల్ పట్టణంలోని ఎంబీఏ గార్డెన్‌లో చెన్నైకి చెందిన శంకర నేత్రాలయ కంటి వైద్య నిపుణులతో నిర్వహిస్తున్న ఈ శిబిరానికి కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తొలిరోజే 600 మందికి పైగా హాజరుకాగా, 350 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. 180 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందించడంతో పాటు 30 మందిని కంటి శుక్లాల శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు.

**ఐదు మండలాల్లో వేలాది మందికి సేవలు...**

ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ డబ్బులు లేక కంటి సమస్యలను భరిస్తూ జీవించాల్సిన పరిస్థితి ఏ పేద కుటుంబానికీ రాకూడదన్నారు. కంటి చూపు ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమని, సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వెల్దండలో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ఆమనగల్, కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రస్తుతం కడ్తాల్‌కు చేరుకుందని తెలిపారు. ఇప్పటివరకు ఐదు మండలాల్లో నిర్వహించిన ఐదు శిబిరాల ద్వారా 19,200 మందికి పైగా కంటి పరీక్షలు, 722 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు, 13,075 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందించినట్లు తెలిపారు. ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణ, ఆశీర్వాదం సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రేరణగా నిలుస్తోందన్నారు.

**సెప్టెంబర్ 16 వరకు కంటి పరీక్షలు**

కడ్తాల్‌లో సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు ఉచిత కంటి పరీక్షలు, సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు రాఘవేందర్ రెడ్డి తెలిపారు. కడ్తాల్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు ఆసిఫ్ అలీ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ బిక్షపతి, మాజీ సర్పంచ్ ఎల్.ఎన్. రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు, శంకర నేత్రాలయ వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్దండలో బీఆర్ఎస్ బలోపేతంపై నేతల మంతనాలు

**ఉప్పల వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్దండ మండల నాయకులు**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మిషన్ భగీరథ మాజీ ఉపాధ్యక్షులు, ఉప్పల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్‌ను వెల్దండ మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కానుగుల జోగయ్య, పూరి రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ఉప్పల వెంకటేష్‌తో ఆత్మీయంగా సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వెల్దండ మండలంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు నాయకులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు యాదయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తలు పాటించాలి

**8వ వార్డులో ఫ్రైడే-డ్రైడే**

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



**వనపర్తి సెప్టెంబర్ 11 క్రైమ్ మిర్రర్:** ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని, తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించారు.?వార్డులోని పలు వీధులు, మురుగుకాల్వలను నేరుగా పరిశీలించిన చైర్మన్, స్థానిక ప్రజలతో మాట్లాడి నీటి నిల్వ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలోని పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, పాత టైర్లు, నీటి తొట్టల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉంటే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వ్యాప్తి చేసే దోమల లార్వా వృద్ధి చెందుతుందని హెచ్చరించారు. వారానికి ఒకరోజు ఇళ్లలోని నీటి పాత్రలను ఖాళీ చేసి ఆరబెట్టడం ద్వారా దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చని సూచించారు, అనంతరం పారిశుధ్య అధికారులతో మాట్లాడుతూ, వార్డులో చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరగాలని ఆదేశించారు. దోమల తీవ్రత ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయాలని, క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. మురుగు నీరు నిలిచిపోకుండా కాల్వలను ఎప్పటికప్పుడు పూడిక తీయాలని సిబ్బందిని ఆదేశించారు, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పురపాలక సంఘాన్ని నిర్మించుకోగలమని, చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకే అందించాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మోతే రాములు, లక్ష్మీకాంత్, శానిటరీ ఇన్స్పెక్టర్ యోగేష్ కుమార్, వైద్య, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఘనంగా కుప్పగండ్ల సర్పంచ్ ముక్తాల రమేశ్ జన్మదిన వేడుకలు

**కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కుప్పగండ్ల గ్రామ సర్పంచ్ ముక్తాల రమేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట వెంకటయ్య గౌడ్, యాదమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముక్తాల రమేశ్ కేక్ కట్ చేయగా, హాజరైన వారు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్‌ను అందరికీ పంచి సంతోషాన్ని వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో మరింత చురుగ్గా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ కేశమల్ల కృష్ణ, ఉపసర్పంచ్ ప్రసాద్, కొయ్యల పుల్లయ్య, మట్ట విష్ణుగౌడ్, రమేశ్ గౌడ్, శివరాజ్ గౌడ్, గణేష్ గౌడ్, భరత్ గౌడ్, మల్లేశ్, లింగం యాదవ్, సర్వేయ, రాహుల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధిపై సర్వసభ్య సమావేశంలో చర్చ..!!

**- అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై చర్చ**

**- పాల్గొన్న మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు, సర్పంచులు**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పంతాకాన్ని తిరుమల, పీఏసీఎస్ చైర్మన్ చర్ల తిరుపతిరెడ్డి, ఎంపీడీవో, జిల్లా స్పెషల్ ఆఫీసర్‌తో పాటు మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వివిధ శాఖల పనితీరుపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మహాదేవపూర్ సర్పంచ్ హాసీనా భాను కూడా సమావేశంలో పాల్గొని గ్రామానికి సంబంధించిన పలు అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు ప్రజా సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె కోరారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో పలువురు సర్పంచులు తమ గ్రామాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



# పదకొండేళ్లుగా పర్యావరణ పరిరక్షణకు బాటలు

**కడ్తాలలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(కడ్తాల్):** పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపడుతున్న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం 11వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. ప్రతి ఏడాది గణేష్ నవరాత్రుల సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్, ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 12న శనివారం ఉదయం 10 గంటలకు కడ్తాల పట్టణంలోని పాల శీతలీకరణ కేంద్రం వద్ద మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆమనగల్, కడ్తాల మండలాల పీఏసీఎస్ చైర్మన్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమం జరగనుంది.

**మట్టి గణపతితో పర్యావరణానికి మేలు....**



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజ మట్టితో తయారు చేసిన గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించాలని వారు పిలుపునిచ్చారు. మట్టి వినాయకుడిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు నీటి కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. 'మట్టి వినాయకుడిని పూజిద్దాం.. పర్యావరణాన్ని సంరక్షించుకుందాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల, ఆమనగల్ మండలాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మట్టి గణపతి ప్రతిమలను తీసుకెళ్లి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని గంప వెంకటేష్ గుప్తా కోరారు.

# మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణకు పిలుపు

**జడ్పీహెచ్ఎస్ గుండాలలో విద్యార్థులకు మట్టి విగ్రహాల తయారీపై అవగాహన**

**క్రైమ్ మిర్రర్,గుండాల:-**పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు గుండాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మట్టి గణపతి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సహజసిద్ధమైన మట్టితో గణపతి విగ్రహాలను స్వయంగా తయారు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. విద్యార్థులకు "మట్టి గణపతిని తయారు చేద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని అందించారు. సహజ రంగుల వినియోగం, నీటి వనరుల పరిరక్షణ, పర్యావరణహితంగా పండుగలను నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో




సృజనాత్మకతతో పాటు పర్యావరణ బాధ్యతను పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిర్వహిస్తామని పాఠశాల సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శనివారం 12-09-2026జిల్లా ఖజానా కార్యాలయంలో వార్షిక తనిఖీ

**ఖజానా నిర్వహణలో నిబంధనలు, పారదర్శకత, జవాబుదారీతనం తప్పనిసరి**

**సీనియర్ డీఏజీ ఎం. నరేష్ కుమార్**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 11:** సంగారెడ్డి జిల్లా ఖజానా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఎం. నరేష్ కుమార్ శుక్రవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ నెల 7 నుంచి కొనసాగుతున్న వార్షిక ఆడిట్‌లో భాగంగా చివరి రోజు కార్యాలయాన్ని సందర్శించిన ఆయన వివిధ రికార్డులు, రిజిస్టర్లు, ఆర్థిక లావాదేవీల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌తో పాటు ఏటీఓలు, ఎస్టీఓలతో సమావేశమై ఖజానా నిర్వహణ, ఆడిట్ అంశాలు, కార్యాలయ విధులపై సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలు, ప్రస్తుత ఆడిట్ అభ్యంతరాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో నిబంధనలు, విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని నరేష్ కుమార్ సూచించారు. ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్ ద్వారా పేపర్‌లెస్ ఆన్‌లైన్ బిల్లుల సమర్పణ జరుగుతున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి, ఎలాంటి లోపాలకు తావులేకుండా బిల్లుల ప్రక్రియను నిర్వహించాలన్నారు. పెన్షనర్లకు సంబంధించిన చెల్లింపులను సక్రమంగా, సకాలంలో నిర్వహించాలని, నెలవారీ ఖాతాలను నిర్ణీత గడువులోగా అకౌంటెంట్ జనరల్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేసి భద్రపరచడంతో పాటు ప్రభుత్వ నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా ఖజానా కార్యాలయంలో రికార్డుల నిర్వహణ, విధుల అమలు, ఆడిట్ ప్రక్రియకు సంబంధించి చేపడుతున్న చర్యలపై సీనియర్ డీఏజీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఎస్టీఓలు సంపత్ స్వరూప్, రాజారెడ్డి, శారద, ఏటీఓలు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.




# పోషణ మాస కార్యక్రమం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీస్ యందు ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత ఆధ్వర్యంలో మరి పోషణ మాసం భాగంలో పౌష్టికాహారం గురించి పోషణ మాస కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి వి వినోద్ కుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారము చిరుధాన్యాలు రాగులు సజ్జలు జొన్నలు మిల్లెట్స్ ఇందులో ఎక్కువ పోషక విలువలు ఉంటాయి కాబట్టి ఆకుకూరలు పండ్లు పాలు గుడ్లు ప్రతినిత్యం మనం తీసుకున్న ఆహారంలో ఇవి ఉండాలి వ్యాధి నిరోధించే శక్తిని ఇస్తాయి గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఎక్కువ శక్తిని ఇ స్తాయి కాబట్టి చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలమృతాన్ని వినియోగించుకోవాలని పౌష్టిక విలువలతో కూడిన ఆహార పదార్థాలను తీసుకొని ఏ లాంటి అనారోగ్యానికి గురికాకుండా నివారించవచ్చు పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను మున్సిపాలిటీ ఆఫీస్ నందు కూడా ప్రదర్శించడం జరిగినది ఈ కార్యక్రమానికి హాజరైనటువంటి ఎంపీడీవో జే పాండు ఇది గ్రామ సర్పంచులు ఆ మండల్ లెవల్ అధికారులు కార్యదర్శులు మున్సిపాలిటీ ఆఫీస్ నందు జరిగిన కార్యక్రమములో కమిషనర్ గురులింగం మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ రామ్ పతి ఆర్ ఐ షరీఫ్ జానీ అంగన్వాడి టీచర్లు దాడి అరుణ ఎన్ అవర్ల బుజ్జమ్మ శోభారాణి జ్యోతి కృష్ణవేణి మమత వరమ్మ తదితరులు తదితరులు.

# ఫిన్లాండ్ విద్యా పర్యటనకు గుండాల ఉపాధ్యాయుడు

**ఎడ్యుకేషనల్ ఎక్స్పోజర్ విజిట్‌కు వరకాల మధుసూదన్‌రావు ఎంపిక**

**క్రైమ్ మిర్రర్,గుండాల:-** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎడ్యుకేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా ఫిన్లాండ్‌లో జరిగే విద్యా క్షేత్ర పర్యటనకు గుండాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్) టీజీటీ ఫిజిక్స్ ఉపాధ్యాయుడు వరకాల మధుసూదన్‌రావు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి అక్టోబరు 3 వరకు ఫిన్లాండ్‌లో జరిగే విద్యా పర్యటనలో ఆయన పాల్గొననున్నారు. ఫిన్లాండ్‌లోని విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన విధానాలను పరిశీలించే అవకాశం ఈ పర్యటన ద్వారా లభించనుంది. మధుసూదన్‌రావు ఎంపికపై మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాము, గుండాల సర్పంచ్ ఐలయ్య, పాచిల్ల సర్పంచ్ మహేష్, గుండాల ఎంఈఓ అగ్గి రాములు, గుండాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు బాలరాజు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మధుసూదన్‌రావును ఘనంగా సన్మానించి అభినందించారు. గుండాల నుంచి ఫిన్లాండ్ వరకు ఉపాధ్యాయుడి ఎంపిక కావడం పట్ల మండల విద్యా రంగంలో హర్షం వ్యక్తమవుతోంది.



# కనకదుర్గమ్మకు కన్నుల పండుగగా క్షీరాభిషేకం

**శ్రావణమాసం 5వ శుక్రవారం.. అమ్మవారికి ప్రత్యేక పూజలు**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారుపర్యవేక్షణలో.. ముఖ్య అర్చకులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ, అర్చక బృందం అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి 108 లీటర్ల ఆవుపాలతో శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతా రమేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, శ్రీ బాల నరసింహ స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడి వెంకటేశ్వర్లు దంపతులు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి శుక్రవారం కావడంతో అమ్మవారి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక సందడితో నిండిపోయింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి తమ మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ డైరెక్టర్లు గంజి వెంకటేశం, బుద్ధ విమల కృష్ణమూర్తి, వరకాంతం నరసింహారెడ్డి, రుద్రారపు లింగయ్య, జిట్ట సాయిలు, బెలిదే సత్యనారాయణ, ఏళ్ల మాధవి, పట్టణ ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల స్ఫూర్తితో భూ పోరాటాలను కొనసాగిస్తాం

**మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ తిరోగమన వాదనలను తిప్పి కొట్టండి**

**నాటి పోరాట యోధుల స్ఫూర్తిని ప్రజలకు తెలియజేయండి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పిలుపు**




**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, క్రైమ్ మిర్రర్:-** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరలకు, జాగిరి దారులకు వ్యతిరేకంగా సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా భూ పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు తెలిపారు. నాటి చరిత్రను, పోరాట స్ఫూర్తిని, వారి త్యాగాన్ని మతోన్మాద బిజెపి, ఆర్ఎస్ఎస్ హిందూ, ముస్లింల మధ్య జరిగిన వివాదంగా చిత్రీకరిస్తున్న వక్రీకరణ విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సుందరయ్య భవన్, భువనగిరిలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి అధ్యక్షత వహించగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకట్రాములు పాల్గొని మాట్లాడుతూ నాడు తెలంగాణ ప్రాంతంలో నైజాం సర్కార్, జమీందారులు, భూస్వాములు, రజాకార్ల నిర్బంధ వెట్టి చాకిరికి, దోపిడికి వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంత వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, వృత్తిదారులు ఐక్యంగా దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరి పోవాలని ఎర్రజెండా నాయకత్వంలో సాగించిన మహోత్తరమైన పోరాటమే వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని తెలిపారు. ఈ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు దక్కిందని, 3 వేలకు పైగా గ్రామాలు విముక్తి పొంది గ్రామ స్వరాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారని, 4 వేలకు పైగా ప్రజలు, కమ్యూనిస్టు యోధులు, రైతు కూలీలు చనిపోయారని తెలిపారు. కౌలు రైతులకు భూములపై హక్కును కల్పించే కౌల్దారి చట్టాన్ని సాధించామని చెప్పారు. నాటి యోధుల పోరాట ఫలితంగా నేడు పేదలు అనుభవిస్తున్న ఇనాం భూములు, అసైన్డ్ మెంట్ భూములు, చెరువు శిఖం భూములు వంటివి సాధించుకున్నారని చెప్పారు. ఇలాంటి చరిత్ర కలిగిన పోరాటాన్ని బిజెపి, ఆర్ఎస్ఎస్ వక్రీకరించడమంటే వారి దిగజారుడు విధానానికి నిదర్శనమని చెప్పారు. ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టడం కోసం అమరుల రక్తతర్పణం గావించిన ప్రతి గ్రామంలో సభలు, ఊరేగింపులు జరిపి మత ఉన్మాదులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నేడు అభివృద్ధి పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల భూములను లాక్కొని కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సాయుధ పోరాట స్ఫూర్తితో భూమి, కూలీ, ఇండ్ల స్థలాలు, ఇండ్లు, సంక్షేమ పథకాల అమలుకై ఐక్యంగా అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాల వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఈ సమావేశం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచకొండ రాములమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు సిరిపంగి స్వామి, గుంటోజి శ్రీనివాస్ చారి, అల్లూరి కుమార్, సహాయ కార్యదర్శులు పల్లెర్ల అంజయ్య, జూకంటి పౌల్, జిల్లా కమిటీ సభ్యులు చింతకాయల నర్సింహా, కొండపురం యాదగిరి, మానె సాలయ్య, గ్యార అందాలు, చింతల సుదర్శన్, యాట బాలరాజు, కొండె కిష్టయ్య, మేడి ముకుందం తదితరులు పాల్గొన్నారు.



## వెనువుమట్ల గ్రామంలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం....!

**జగిత్యాల జిల్లా బ్యూరో (క్రైమ్ మిర్రర్):** గొల్లపల్లి మండలం వెనువుమట్ల గ్రామంలో నేడు పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, ముఖ్యంగా మహిళలకు మరియు తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యమైన ముఖ్యాంశాలు: సమతుల్య ఆహారం: శరీరానికి కావలసిన పోషకాలు అందాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలనే దానిపై తల్లులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణ: ప్రస్తుత కాలంలో చాలా మంది కిశోర బాలికలు మరియు తల్లులు రక్తహీనత (ూఅవఎఱు) బారిన పడుతున్నారని, దీని నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన సరైన పోషకాహారం గురించి వివరించారు. బాలామృతం ప్రాముఖ్యత: ఆరు నెలలు నిండిన పిల్లలకు అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే 'బాలామృతం' తప్పనిసరిగా తినిపించాలని తల్లులకు ప్రత్యేకంగా సూచించారు. పాల్గొన్న ప్రముఖులు: ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ జ్యోతి, గ్రామ సర్పంచ్ నక్క స్రవంతి జమలాకర్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు అంగన్వాడీ టీచర్లు సునీత, శాంత, శ్యామలత, ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు పిల్లల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి కృష్ణా రెడ్డి అకాల మృతి చెందాగా వారి దశదిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. మృతి చెందిన వ్యక్తి గ్రామంలో మంచి వ్యక్తిగా, అందరితో కలివిడిగా ఉంటూ గ్రామ అభివృద్ధికి తోడ్పడ్డారని గుర్తు చేసుకున్నారు. వారి మరణం కుటుంబానికి, గ్రామానికి తీరని లోటు అని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి మనోధైర్యం ఇవ్వాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి తన వంతు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యువజన సంఘం అధ్యక్షులు తుమ్మల నాగరాజు రెడ్డి, పిట్టంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బండారు ప్రభాకర్ రెడ్డి,వార్డు సభ్యులు సామ మహేందర్ రెడ్డి,మాజీ వార్డు సభ్యులు సింగిరెడ్డి జంగారెడ్డి, నాయకులు జంగిటి వెంకటేష్ యాదవ్,పైళ్ల మహేందర్ రెడ్డి,సింగిరెడ్డి గోపిరెడ్డి,సిద్దగోని ఉపేందర్ గౌడ్,సింగిరెడ్డి శివారెడ్డి,సింగిరెడ్డి యాదిరెడ్డి, దేవరపల్లి దీనిష్ రెడ్డి, కోమిరెల్ల నరేందర్ రెడ్డి మరియు గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితులపై అనుచిత వ్యాఖ్యల పై కాంగ్రెస్ ఎస్సి సెల్ ఫైర్

- పావని గౌడ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ ఎస్సి సెల్
- పావని గౌడ్ వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నాయకులు
- దళితులను అవమానిస్తారా..? తగిన మూల్యం చెల్లించాల్సిందే..
- దళితుల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ కించపరిస్తే సహించం
- కులవివక్షకు వ్యతిరేకంగా దళిత సమాజం ఏకం కావాలి
- డా. బిఆర్. అంబేద్కర్ రాజ్యాంగమే సమానత్వానికి ఆధారం
- దళితులపై అనుచిత వ్యాఖ్యలకు ప్రజాక్షేత్రంలో సమాధానం
- ఫామ్‌హౌస్ ఘటనపై బీఆర్ఎస్ తీరును ఎండగట్టిన కాంగ్రెస్
- కులవివక్షకు వ్యతిరేకంగా దళిత సమాజం ఏకం కావాలి
- అంబేద్కర్ రాజ్యాంగంతోనే సమానత్వం వచ్చిందన్న కొల్లూరు భరత్
- కులవివక్షపై అవసరమైతే భారీ ఉద్యమం తప్పదన్న హన్మంతు యాదగిరి
- పావని గౌడ్ పై కేసులు నమోదు చెయ్యాలి మాజీ ఎంపీటీసీ దేవాదానం
- కాంగ్రెస్ హయాంలోనే దళితులకు సముచిత స్థానం ఉండేదన్న శివానందం




**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 11:** ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ మహిళా నాయకురాలు పావని గౌడ్ దళితులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ దేవాదానం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేవాదానం పావని గౌడ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు హన్మంతు యాదగిరి మాట్లాడుతూ.. దళితుల పట్ల అనాదిగా కొనసాగుతున్న వివక్షను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎస్సీ సెల్ నాయకులు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద నిరసన తెలిపిన సందర్భంలో పావని గౌడ్ దళితులను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం, ఫామ్‌హౌస్ అపవిత్రమైందంటూ వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. చంద్రుడిపైకి వెళ్లే స్థాయికి ప్రపంచం అభివృద్ధి చెందుతున్నా.. కులం పేరుతో మనుషులను అవమానించే ధోరణులు కొనసాగడం దురదృష్టకరమని అన్నారు. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ అగ్రనేతలు స్పీకర్ గడ్డం ప్రసాద్పై చేసిన అనుచిత వ్యాఖ్యలను కూడా కాంగ్రెస్ నాయకులు ఖండించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్‌పై కులపరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం మాట్లాడుతూ.. అసెంబ్లీ గేటు ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎర్రవల్లి పామ్ హౌస్ నుండి తమకు డైరెక్షన్లు వచ్చినట్లు కేటీఆర్, హరీష్ రావు లే చెప్పారని గుర్తు చేశారు. కేసీఆర్ 10 సంవత్సరాల లో దళితులకు చేసిన మోసం అందరికి తెలుసని అన్నారు. మొట్ట మొదట దళిత ముఖ్యమంత్రి ని చేస్తానని కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. తెలంగాణ ను కాపలా కుక్కల ఉంటానన్న కేసీఆర్ మాట తప్పాడని అన్నారు. బిఆర్ఎస్ నాయకుల చరిత్ర గురించి అందరికి తెలుసునని అన్నారు. గతంలో మైనంపల్లి హన్మంత్ రావు, హరిష్ రావు గురించి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. హరీష్ రావు చరిత్ర ట్రంక్ పెట్టె, ప్యారగన్ చెప్పులు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇందిరా గాంధీ హయాంలో ప్రతి దళితులకు భూములు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. ఒడిఎఫ్, ఆర్డినెన్సు ఫ్యాక్టరీ, భేల్, పటాన్ చెరు పారిశ్రామిక వాడ వచ్చిందంటే దానికి కాంగ్రెస్ పార్టీయే కారణం కాదా అని అన్నారు. కానీ బిఅరెస్ వాళ్లు తెలంగాణ వచ్చినప్పటి నుండి దోచుకోవడం, దాచు కోవడం తప్ప మరేమీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. దోచుకున్న ఆస్తులన్ని పటాన్ చెరు చుట్టూ ఉన్నాయి కదా అంటూ పటాన్ చెరు లొ హరీష్ రావుకి ఏమి పని అని అన్నారు. ఇక ముందు దళితుల వద్దకు వస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు కొల్లూరు భరత్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి దళితులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. దళితుడైన ఉప ముఖ్యమంత్రికి కొద్దికాలానికే పదవి నుంచి తప్పించారని విమర్శించారు. ప్రజా కళాకారుడు గద్దర్ విషయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దళిత, బహుజన వర్గాల కృషిని విస్మరించడం సరికాదన్నారు. దళితులకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు హయాంలో జరిగిన అన్యాయాలపై సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ దళితులకు సముచిత స్థానం కల్పిస్తోందని భరత్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీకి దళితుడైన గడ్డం ప్రసాద్‌ను స్పీకర్‌గా ఎన్నుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనమన్నారు. జాతీయ స్థాయిలోనూ దళితులకు ప్రాధాన్యత కల్పించిన ఘనత కాంగ్రెస్ నాయకత్వానిదేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పాలన, అవినీతి అంశాలపై అసెంబ్లీలో సమాధానం చెప్పాల్సి వస్తుందనే భయంతోనే మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి దూరంగా ఉన్నారని భరత్ విమర్శించారు. దళిత స్పీకర్‌ను 'అధ్యక్షా' అని సంబోధించాల్సి వస్తుందనే ఉద్దేశంతో సభకు రాకపోవడం ప్రజాస్వామ్యానికి అవమానమని అన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని భరత్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ ద్వారానే జరిగిందని పేర్కొన్నారు. తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో దళిత, బహుజన వర్గాల పాత్రను ఎవరూ విస్మరించలేరన్నారు. "ఉద్యమాలు, దీక్షలు మాత్రమే కాదు.. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే తెలంగాణ ఏర్పాటైంది" అని ఆయన అన్నారు. దళితులు, బడుగు బలహీన వర్గాలు సమానత్వం కోసం పోరాడటానికి స్ఫూర్తినిచ్చింది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచనా విధానమేనని తెలిపారు. అత్యంత పేదవాడు, అత్యంత ధనికుడు కూడా చట్టం ముందు సమానమేననే సూత్రాన్ని రాజ్యాంగం అందించిందన్నారు. ఫామ్‌హౌస్‌కు దళితులు వెళ్లిన సందర్భంలో అపవిత్రతకు సంబంధించిన వ్యాఖ్యలు చేయడం, పసుపు నీళ్లు చల్లుకోవడం వంటి చర్యలు కులవివక్షను ప్రోత్సహించేలా ఉన్నాయని భరత్ ఆరోపించారు. దళితులు, బహుజనుల కృషి లేకుండా తెలంగాణ ఉద్యమం విజయవంతమయ్యేదా అని ప్రశ్నించారు. దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసే వారికి ఎన్నికల్లో ప్రజలు తగిన సమాధానం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. దళితులపై వివక్షకు వ్యతిరేకంగా దళిత సంఘాలు, దళిత సమాజం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా ప్రజాక్షేత్రంలో అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. దళితుల గౌరవం, సమానత్వం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సుధాకర్ గౌడ్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చంద్రయ్య, కౌన్సిలర్లు ప్రవీణ్, రవి ఆత్మకమిటి మెంబెర్ నగేష్, యువజన నాయకులు సురేష్, మహేష్, జె. శ్రీను మాజీ మెంబెర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మీర్పేట్ టీఎస్ఆర్ నగర్ ఫేజ్–2లో నీటి కోసం నిత్యం యుద్ధమేనా..?

**ప్రతిరోజూ తాగునీటి కోసం అవస్థలు...!**

**సమస్యను పరిష్కరించాలంటున్న స్థానికులు ఆవేదన**

**క్రైమ్ మిర్రర్, మీర్‌పేట్ (హైదరాబాద్):** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ɾ=ా నగర్ ఫేజ్–2లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, అవసరమైన స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లలో నిత్యావసరాలకు అవసరమైన నీరు అందకపోవడంతో మహిళలు, వృద్ధులు సహా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. నీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.




**ప్రతిరోజూ ఇదే పరిస్థితి ఎందుకు?**

ɾ=ా నగర్ ఫేజ్–2లో నీటి సమస్యకు అసలు కారణం ఏమిటన్నది అధికార యంత్రాంగం స్పష్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. పైప్‌లైన్ సమస్యా..? నీటి సరఫరాలో అంతరాయమా..? లేక సరిపడా నీటి సరఫరా లేకపోవడమా..? అనే విషయాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతిరోజూ ఎదురవుతున్న నీటి ఇబ్బందులకు తక్షణ చర్యలు తీసుకుని, నిరంతర నీటి సరఫరా అందేలా చూడాలని కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులు అధికారుల దృష్టికి చేరుతాయా..? సమస్యకు ఎప్పుడు పరిష్కారం లభిస్తుంది..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# తమ కాలనీ మీదుగా ఆర్ఓబి పనులు చేపట్టవద్దు మల్కాజ్గిరి కాలనీవాసులు

**బాధితులకు మద్దతు తెలిపిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్**

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ మల్కాజిగిరి, బాల సరస్వతి నగర్, లక్ష్మీ సరస్వతి నగర్, సర్దార్ పటేల్ నగర్, దుర్గా నగర్, కృష్ణ సాయి కాలనీ, మరియు హైదర్ నగర్ ప్రధాన రోడ్డు మీదుగా ఆర్ ఓ బి ని జడ్ టి ఎస్ లాలపేట బ్రిడ్జి వరకు వేసేందుకు ఈరోజు రైల్వే అధికారులు మరియు మల్కాజిగిరి మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచ్చేసి మార్కింగ్ పాయింట్లు పరిశీలించినట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న మల్కాజిగిరి డివిజన్ మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిసర ప్రాంతాల కాలనీవాసులతో మాట్లాడి ఆర్ ఓ బి ప్రతి పాదన కు వ్యతిరేకంగా కాలనీ వాసులకు మద్దతుగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ ఈ యొక్క ఆర్ ఓ బి బ్రిడ్జి నిర్మాణం వల్ల చుట్టుముట్టు పరిసర ప్రాంతాల ప్రజలు సర్దార్ పటేల్ నగర్, దుర్గా




నగర్, కృష్ణ సాయి కాలనీ, బాల సరస్వతి నగర్, లక్ష్మీ సరస్వతి నగర్ , హైదర్ నగర్, ఉప్పరిగూడ, మరియు ఓల్డ్ మల్కాజ్గిరి ప్రాంతాలలో సుమారుగా రోడ్డు కు ఇరువైపులా 400 ఇండ్లు కోల్పోతారని బాధితులకు అధిక నష్టం కలుగుతుందని తెలిపారు. విషయం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువెళ్ళి బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తానని జగదీష్ గౌడ్ తెలిపారు.

# తెలంగాణలో స్పైన్ సర్జరీకి కొత్త వేదిక

**వరంగల్‌లో అసోసియేషన్ ఆఫ్ స్పైన్ సర్జన్స్ ఆఫ్ తెలంగాణ అధికారిక ప్రారంభం**

**వరంగల్ (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో స్పైన్ సర్జరీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అసోసియేషన్ ఆఫ్ స్పైన్ సర్జన్స్ ఆఫ్ తెలంగాణ అధికారికంగా ఆవిర్భవించింది. వరంగల్‌లో నిర్వహించిన ఝూూూ×జూచీ -- 2026 కార్యక్రమంలో అసోసియేషన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని స్పైన్, ఆర్థోపెడిక్ సర్జన్లను ఒకే వేదికపైకి తీసుకురావడం, ఆధునిక వైద్య సాంకేతికత, నూతన చికిత్సా విధానాలపై జ్ఞానాన్ని పంచుకోవడం ఏఎస్ఎస్టి ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, నావిగేషన్, రోబోటిక్స్, డిఫార్మిటీ కరెక్షన్, కాంప్లెక్స్ స్పైన్ సర్జరీ, ట్రామా కేర్ తదితర అధునాతన వైద్య విధానాలపై అకడమిక్ కార్యక్రమాలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్పైన్ సర్జరీ రంగంలో పరిశోధనలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్న ూూూ మల్టీసెంటర్ స్టడీస్, క్లినికల్ రీసెర్చ్, డేటాబేస్‌ల ఏర్పాటు, చికిత్సా ఫలితాలపై అధ్యయనాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా సహకారాన్ని పెంపొందించేందుకు కృషి చేయనుంది. యువ వైద్యులకు ప్రోత్సాహం, యువ స్పైన్ సర్జన్లకు మార్గదర్శకత్వం అందించడంతో పాటు వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలు, పరిశోధనల్లో భాగస్వామ్యం, అధునాతన సర్జికల్ టెక్నిక్స్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ూూూ అధ్యక్షుడిగా డాక్టర్ రాఘవ దత్ ముల్కుట్ల, కార్యదర్శిగా డాక్టర్ పవన్ కుమార్, కోశాధికారిగా డాక్టర్ సురేష్ చీకట్ల, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ దేవానంద్ బాధ్యతలు చేపట్టారు. తెలంగాణలో స్పైన్ విద్య, పరిశోధన, వైద్య సేవలకు మరింత మెరుగైన వేదికగా ూూూను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. “ఒక రాష్ట్రం... ఒక స్పైన్ కమ్యూనిటీ... ఒక విజన్” అనే నినాదంతో అసోసియేషన్ పని చేయనుందని తెలిపారు.










# అక్రమమే అయితే సక్రమం ఎలా అయ్యింది?

**చర్యలు తీసుకున్న అధికారులే తెలిపాలి...**

**ఆగస్టు 28న కూల్చిన షెడ్.. సెప్టెంబర్ 9న సక్రమమైందా?..**

**కూల్చివేత నుంచి తిరిగి కొనసాగింపు వరకు ఏం జరిగింది?**

**ఇది ఒకటేనా ఇంకా ఇలాగే ఏమైనా ఉన్నాయా దానిపై**

**ఏసీబీ విచారణకు డిమాండ్.....**

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** మియాపూర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై అధికారుల తీరు తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. మియాపూర్ బీకే ఎన్ క్లేవ్ ప్రాంతంలో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్ పై ఆగస్టు 28న అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేత చర్యలు చేపట్టి నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే అదే షెడ్ సెప్టెంబర్ 9 నాటికి యధావిధిగా ఎలా కొనసాగుతోంది? అనే ప్రశ్న ఇప్పుడు స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఫోటోలో ‘నాడు’ అంటే కూల్చివేత సమయంలో తీసిన దృశ్యం, ‘నేడు’ అంటే అదే స్థలంలో మళ్లీ పూలదండలతో అలంకరించి, షట్టర్లు వేసి వ్యాపారానికి సిద్ధం చేసిన దృశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.

**అక్రమమే అయితే సక్రమం ఎలా అయ్యింది?**

ఆగస్టు 28న అక్రమ నిర్మాణంగా గుర్తించి కూల్చివేతకు గురైన నిర్మాణం కొద్ది రోజుల వ్యవధిలోనే తిరిగి కొనసాగుతుంటే దానికి సంబంధించిన అనుమతులు, ఫైల్ నోట్లు, అధికారిక ఉత్తర్వులు, స్థల పరిశీలన నివేదికలను అధికారులు బహిర్గతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ఏదైనా డీల్ జరిగిందనే ఆరోపణలు వినికిడి స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలలో వాస్తవమెంత? ఎవరి పాత్ర ఉంది? ఎలాంటి లావాదేవీలు జరిగాయ? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాన్ని తొలుత కూల్చివేసి, అనంతరం అదే నిర్మాణం కొనసాగడానికి అవకాశం కల్పించినట్లయితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వివరణ కోసం ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయని అధికారులు ఈ అంశంపై వివరణ కోసం ముఖ్యంగా సంబంధిత అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాత్రపై ఏసీబీతో స్వతంత్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. “ఆగస్టు 28న అక్రమమైతే.. సెప్టెంబర్ 9న ఎలా సక్రమమైంది?” అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై వివరణ కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తుంటే వారు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు అని స్థానికులు ఆరోపిస్తున్నారు.